


# పరదేశీ కథలు

– చిట్టే సిద్ధ లలిత



– 134 –

## మోసం

**ఆగష్టు నెల ఎండాకాలం**. కువైట్‌లో 50 డిగ్రీల ఎండలో తోటలోని ఖర్జూరపు చెట్లనుండి పండిన ఖర్జూరాన్ని కోస్తోంది ఉమాదేవి.

ఆ కువైట్ ఇంట్లో పదిమందికి వంట చేస్తూ, ఇల్లు తుడిసి శుభ్రం చేస్తూ విశ్రాంతి లేకుండా మధ్యాహ్నం కాస్త తిన్నాక తోట పని కూడా చేస్తుంది.కువైట్ లో అన్ని ఇళ్ళలో వంటకు, ఇంటికి వేరే మనుషులు వుంటారు.

కానీ ఈ ఇంటిలో మాత్రం ఆమె ఒక్కటే అన్నిపనులూ చెయ్యాలి. ఆ ఇంటి యజమానులు కఠినమైన వాళ్ళు.

మధ్యాహ్నం ఆ ఎడారి ఎండకు చెమటలు కక్కుతోంది ఆమె. ఖర్జూరపు మట్టలు తగిలి చేతులు చీరుకుపోతున్నాయి. అయినా తప్పదు.

ఇంటిదగ్గర పిల్లల ముఖాలు గుర్తు చేసుకుంటే ఎండ కూడా ఎ.సి లా అనిపిస్తుంది.

ఒక్కోసారి యజమానురాలు పెట్టే బాధలను భరిస్తూ, కేవలం తన పిల్లల ముఖాలను, నెల జీతాన్ని గుర్తు తెచ్చుకుని ఓర్చుకునేది. ప్రతి నెలా జీతం చేతిలో పడగానే, పది దినార్లు కూడా తన కోసం ఉంచుకోకుండా ఊరికి పంపేది.

భర్త రాము చదువుకోలేదు. పైగా అమాయకుడు. ఇంటి బాధ్యతలు మరిది, తోడి కోడలు చూసుకుంటున్నారు.

అందుకే డబ్బంతా మరిదికే పంపిస్తోంది. ఒకరోజు ఫోన్‌లో మరిది శీనుతో అంది. "శీనూ.. ఈసారి పంపిన రెండు లక్షలతో ఆ పక్కనే ఉన్న చెంచురెడ్డి గారి చేనును కొనేయండి. పిల్లవాడు పదో తరగతికి వస్తున్నాడు, రేపు వాడు పట్నం వెళ్లి చదువుకోవాలన్నా, పాప పెళ్లి చేయాలన్నా మనకు ఆ నాలుగెకరాలే దిక్కు. అలాగే పాపకు ఒక నెక్లెస్ పంపిస్తున్నాను. జాగ్రత్త చెయ్యండి" అని చెప్పింది.

శీను ఫోన్‌లో ఎంతో వినయంగా "వదినమ్మా! నువ్వు అసలు చింతించకు. అన్నయ్య ఆరోగ్యం నేను చూసుకుంటున్నాను, పిల్లలను బాగా చదివిస్తున్నాను. నీ ఆస్తిని నేను కాపాడుతున్నాను. నువ్వు ధైర్యంగా ఉండు" అన్నాడు. ఆ మాటలు నమ్మి ఉమాదేవి మురిసిపోయింది. మరిదికి కృతజ్ఞతలు చెప్పింది.

కానీ అక్కడ జరిగేది వేరు. శీను, కనకమ్మలు ఉమాదేవి పంపించే డబ్బుతో తమ సొంత ఆస్తులను పెంచుకుంటున్నారు. కుట్ర పన్నుతున్నారు. పిల్లలకు అన్యాయం చేస్తున్నారు. దానికి బలయింది ఒక నిండు ప్రాణం.

ఐదేళ్ల తర్వాత, ఉమాదేవికి వీసా గడువు ముగిసి ఊరికి వచ్చింది. తనతో పాటు తెచ్చిన సూట్‌కేసులో పిల్లలకి బట్టలు, భర్తకు, మరిదికి వాచీలు, బట్టలు, మరిది పిల్లలకి ఆటబొమ్మలు.. ఇలా అందరి కోసం ఏదో ఒకటి తెచ్చింది.

సొంత ఇంటికి రాగానే ఉమాదేవికి ఏదో తేడాగా అనిపించింది. శీను పాత ఇల్లు వదిలేసి కొత్తగా మేడ కట్టాడు. కనకమ్మ ఒంటి నిండా తులాల కొద్దీ బంగారం వేసుకుని పట్టు చీరలు కడుతోంది. ఉమాదేవి లోపలికి రాగానే కనకమ్మ మొహం మాడ్చుకుంది.

ఆ పూట పరిస్థితిని చూసి మరుసటిరోజు

"ఏవండీ.. పొలం కాగితాలు బీరువాలో ఉన్నాయా? రేపు ఒకసారి పొలం దగ్గరికి వెళ్లి గట్లు చూసుకుందాం" అంది ఉమాదేవి తన భర్త రాముతో.

రాము భయంభయంగా తమ్ముడి వైపు చూశాడు.

శీను గొంతు సవరించుకుని "వదినమ్మా! అది.. పొలం రిజిస్ట్రేషన్ అప్పుడు అన్నయ్య కొన్ని అప్పులు తీర్చాల్సి వచ్చింది. పైగా పిల్లల చదువులకు నువు పంపిన డబ్బు అసలు సరిపోలేదు. నేను ఆ డబ్బును సర్దాను.

అన్నయ్య సంతకం పెట్టి నా అప్పులోకి ఆ పొలాన్ని నా పేరు మీద రాసిచ్చాడు. ఇప్పుడు అది నా సొంతం" అన్నాడు.

ఉమాదేవికి కాళ్ల కింద భూమి కదిలినట్లయింది. "ఏం మాట్లాడుతున్నావు శీను? నేను పంపిన పదిహేను లక్షల రూపాయలు, బంగారం ఏమయ్యాయి? చెమటను చిందించి రెక్కల కష్టం చేసి, నేను పస్తులుండి పంపిన సొమ్ము అది! రాము.. నువ్వు చెప్పు, నువ్వు ఎలా సంతకం పెడతావు?" అని అరిచింది.

రాము ఏడుస్తూ "ఉమా.. తమ్ముడు ఏదో చెప్పి ఇలా అయితే బాగుంటుంది అన్నాడు. నాకు ఈ కాగితాల వ్యవహారం తెలియదు కదా అని సంతకం పెట్టేసాను" అన్నాడు అమాయకంగా.

కనకమ్మ మధ్యలో అందుకుంది "అబ్బో.. నువు గొప్పగా కువైట్ వెళ్ళావని విర్రవీగకు. నువ్వు పంపిన డబ్బు పిల్లల ఖర్చులకే సరిపోయింది. అక్కడ నువ్వు కోట్లు సంపాదించావా? ఏమి చేసావో అక్కడ ఎవరికి తెలుసు అని నిందిస్తూ

మర్యాదగా ఇక్కడి నుంచి వెళ్ళిపో, లేదంటే పోలీసులకి చెబుతాం" అని గద్దించింది. తన తోడికోడలి నోటి నుంచి వచ్చిన ఆ విషపు మాటలకు ఉమాదేవి నిలువునా నీరైపోయింది.

ముఖ్యంగా తను చెమటోడ్చి కువైట్ లో సంపాదించిన దినార్లతో పాప కోసమని కొన్న నెక్లెస్ కనకమ్మ మెడలో చూసి తల్లడిల్లిపోయింది. ఈ నెక్లెస్ నా బిడ్డకోసం పంపించాను. నువ్వెందుకు వేసుకున్నావని నిలదీసింది.

"ఓయమ్మా... నువు పంపితేనే నేను వేసుకోవాలా? మాకు కువైట్ లో ఎవరూ లేరా? మా పిన్ని కొడుకు నాకు పంపినాడు. వేసుకున్నాను. నా జోలికి వస్తే మర్యాద వుండదు" అని బెదిరించింది కనకమ్మ.

నిరుత్తురురాలయింది ఉమాదేవి.

ఇటు చూస్తే ముక్కుపచ్చలారని పిల్లలు, అమాయకుడైన భర్త. అటు దుర్మార్గులైన మరిది తోడికోడలు.

వెంటనే బట్టలు సర్దుకుని పిల్లలను భర్తను తీసుకుని ఆ ఇంటినుండి బయటికి వచ్చి అమ్మగారింటికి పోయింది ఉమాదేవి.

సంగతి తెలిసిన తల్లి దు:ఖించింది. కువైట్ సొమ్ము ఎంత పాపిష్టిది..! నమ్మినందుకు మరిది కోలుకోలేని దెబ్బ కొట్టాడు. కృంగిపోయింది ఉమాదేవి.

మరుసటి రోజు ఊరి పెద్దలను సంప్రదించి విషయాన్ని చెప్పింది.

ఊరి పెద్దల పంచాయితీలో శీను అబద్ధపు సాక్ష్యాలు సృష్టించాడు. మా అన్నయ్య నా దగ్గర అప్పు తీసుకుని ఈ పొలం రాసిచ్చాడు అని నమ్మబలికాడు. సాక్ష్యంగా ఉన్న కాగితాల ముందు ఉమాదేవి కన్నీళ్లు ఓడిపోయాయి.

కువైట్ లో తను పడిన శ్రమ, చేసిన కష్టం గుర్తొచ్చి అంతా వృథా ప్రయాస అయినందుకు నిస్సహాయంగా నిలబడిపోయింది ఉమాదేవి. ఆ రాత్రి అన్నం తినలేదు. ఏడుస్తూ వుండిపోయింది.

ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఇంత మోసమా? ఇంత ద్రోహమా? మరిదిని, తోడికోడల్ని చంపెయ్యాలి అన్న కోపం వచ్చింది.

ఆ రాత్రి తన ఇద్దరు పిల్లలు నిద్రపోతుంటే వారి దగ్గర కూర్చుని వెక్కి వెక్కి ఏడ్చింది. "అమ్మా.. ఎందుకు ఏడుస్తున్నావు? మమ్మల్ని వదిలేసి నువ్వు మళ్ళీ కువైట్ వెళ్ళిపోతావా?" అని చిన్నపాప అడిగిన ప్రశ్నకు ఉమాదేవి దగ్గర సమాధానం లేదు.

చీకట్లో మెల్లగా బయటకు వచ్చింది. తను కష్టపడి కొన్న ఆ నాలుగెకరాల పొలం దగ్గరికి నడిచింది. ఆ మట్టిని చేతుల్లోకి తీసుకుని ముద్దాడింది. ఈ మట్టి కోసం నా జీవితాన్ని ధారపోశాను. నా ఆశలన్నిటినీ ఈ మట్టి మీద

పెట్టుకున్నాను. దీనితో బతకాలి అనుకున్నాను కానీ ఈ మనుషులు నన్ను మట్టిలో కలిపేశారు అనుకుంది. ఎందుకో ఆ క్షణం ఆమెకు జీవితం మీద విరక్తి కలిగింది.

ఆ పొలం గట్టునే ఉన్న లోతైన బావిలోకి చూసింది. ఆ నీళ్లలో ఆమెకు తన పిల్లల భవిష్యత్తు చీకటిగా కనిపించింది.

ఏదో అసహాయత ఆమె శక్తిని నిర్వీర్యం చేసాయి.ఒక్కసారిగా తనను తాను నిగ్రహించుకోలేక శోకంతో బావిలోకి దూకేసింది.

మరుసటి రోజు ఉదయం ఉమాదేవి శవం బావిలో తేలుతుంటే ఊరంతా కన్నీరు మున్నీరైంది. ఊరి జనం ఆ శవాన్ని చూసి తట్టుకోలేకపోయారు.

పిల్లలు తల్లి శవం చుట్టూ చేరి గగ్గోలు పెడుతున్నారు. తల్లి పోయింది, తండ్రి పిచ్చోడిలా కూర్చున్నాడు. ఆ దు:ఖాన్ని ఎవరు ఆపగలరు? ఆ మరిది, తోడికోడలు మాత్రం ఇదేమీ పట్టనట్టు ఆ పొలంలోనే విత్తనాలు వేస్తున్నారు.

ఇంతలో ఉమాదేవి అమ్మ గంగమ్మ పరిగెత్తుకుంటూ వచ్చింది. కూతురిని చూసి గుండెలు బాదుకుంది.

కొడవలి చేత పట్టుకుని ఉమాదేవి మరిది శీను, తోడికోడలి పైకి ఉరికింది.

"ఆపండ్రా ఆపండి. నా కూతురి ప్రాణాన్ని బలిగా తీసుకున్న ఈ పొలంలో పంట ఎలా పండుతుందో చూస్తాను" అంటూ శీను మెడ మీద వేటు వేసింది. ఇంకో వేటు తోడికోడలు కనకమ్మ పై వెయ్యబోయింది.

ఇంతలో జనాలు పట్టుకుని ఆపారు. ఇద్దరూ బతికిపోయారు.

తొమ్మిదో తరగతి అబ్బాయి తన చెల్లితో కలిసి తల్లి శవం వైపు చూస్తూ ఏడుస్తున్న దృశ్యం ఆ ఊరి చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయింది.జనం ఒక్కటిగా నిలిచి అన్యాయాన్ని ఖండించారు. ఉమాదేవిని ఆ పొలంలోనే పూడ్చి పెట్టి ఆ పొలాన్ని పిల్లలకు ఇప్పించారు. లేకపోతే ఉమాదేవి ఆత్మ శాంతించదని, మరిది శీనుకు దుర్గతులు ప్రాప్తమవుతాయని భయపెట్టారు. మెడ మీద గాయాన్ని తడుముకుంటూ వాడు ఆసుపత్రికి పోయాడు.

కథ అడ్డం తిరగడంతో ఉమాదేవి తల్లి, ఊరి జనాలు తనను ఎక్కడ చంపేస్తారోనని భయపడి కనకమ్మ పరుగులతో అక్కడినుండి పారిపోయింది.

అలా ఉమాదేవి చనిపోయినా తను కువైట్ లో పడ్డ కష్టానికి గుర్తుగా తన కష్టార్జితమైన ఆ పొలాన్ని బిడ్డలకు దక్కేలా చేసింది. మనుషుల్లోని స్వార్థం, దురాశ ప్రాణాలను బలి కొంటోంది. ఇది శోచనీయం.

(మరోకథ వచ్చేనెల)

Post your comments